ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
సిద్దిపేట
శనివారం 13 జనవరి 2024



నాలుగు రోజుల పాటు కొనుగోళ్లు బంద్

గజ్వేల్, జనవరి 12: భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా నాలుగు రోజుల పాటు జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాల్లో ఆయా ఉత్పత్తుల క్రయవిక్రయాలను నిలిపివేస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో 17 నుంచి యథావిధిగా కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. 13న మాత్రం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు కొనసాగుతాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో నేనే సీనియర్, ముప్పై ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నాను అని ఒకరు.. నా రాజకీయ జీవితమే కాంగ్రెస్ పార్టీలో ప్రారంభమైంది, నాకు తగిన గుర్తింపు ఇవ్వాలి అని ఇంకొకరు.. ఎప్పటి నుంచి ఉన్నామని కాదు నేను చేరిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందని మరొకరు.. ఇలా ఎవరికివారు తమ అర్హతను చెప్పుకుంటూ పదవుల కోసం కుస్తీ పడుతున్నారు. నామినేటెడ్ పోస్టు దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు.

- నామినేటెడ్ పోస్టులకు కాంగ్రెస్ నేతల పోటీ
- నెలాఖరులోగా భర్తీ చేస్తామన్న సీఎం రేవంత్
- కార్పొరేషన్లు, స్థానిక పదవులకు విన్నపాలు
- హైదరాబాద్‌లోనే మకాం వేసిన వైనం
- ఎవరికివారే సీనియర్లంటూ ఆశాభావం
- ముఖ్యనేతల ఆశీస్సులతో రేసులోకి..



పదవి కోసం.. ప్రదక్షిణలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 12 : నెలాఖరులోగా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురించాయి. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే పదవుల పంపకం జరుగుతుందనే సంకేతాలు రావడంతో నేతలంతా హైదరాబాద్ బాట పట్టారు. ఇటీవల ఎన్నికల్లో అభ్యర్థులుగా బరిలోకి దిగిన వారితోపాటు టికెట్ ఆశించి భంగపడిన వారు, ఇతర నాయకులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

రాష్ట్రస్థాయి పోస్టులకు పోటీ

గజ్వేల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమిపాలైన తూంకుంట నర్సారెడ్డికి అధిష్ఠానం నుంచి కీలక పదవికి హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నది. అదేవిధంగా దుబ్బాకలో పోటీ చేసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి సైతం పదవి ఖాయమే అన్నట్లుగా చర్చ జరుగుతోంది. ఇక సిద్దిపేటలో బరిలోకి దిగిన పూజల హరికృష్ణతోపాటు ఇక్కడ టికెట్ ఆశించి భంగపడిన ముఖ్యనేతలు, సీనియర్ నాయకులు తమకు రాష్ట్రస్థాయిలో పదవి వస్తుందనే ధీమాతో ఉన్నారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి సైతం రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తుందనే ధీమాతో ఉన్నారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని వీడకుండా కరుడుగట్టిన నాయకులుగా ఉన్న వారంతా నేడు పదవుల రేసులో ఉన్నారు. ముందుగా రాష్ట్రస్థాయి పదవులపై ఫోకస్ పెడుతున్నారు. అటు ఇటైతే జిల్లాలోని నామినేటెడ్ పదవులు లేదంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాల గురించి పట్టుబట్టడానికి సమాయత్తమవుతున్నారు.

ముఖ్యనేతల దృష్టిలో పడుతూ..

జిల్లాకు చెందిన ఆశావహులు ఇప్పటికే ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సైతం కలిసి విన్నపాలు అందించారు. అదేవిధంగా జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి తమ ఆకాంక్షలను వల్లెవేస్తున్నారు. పదవులకు తమ పేర్లను పరిశీలించాలని పదేపదే కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజకీయ ప్రయాణం చేసిన నేతలు కూడా జిల్లాలో ఉన్నారు. వీరు సైతం తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఇన్నాళ్లు ఎదురుచూసినందుకు తమకు అవకాశాలు దక్కాలని కోరుతూ నిత్యం రాజధానికి, సచివాలయానికి వెళ్లివస్తున్నారు.

జిల్లాలోని పదవులపైనా కన్ను

రాష్ట్రస్థాయి పదవుల్లో నిరాశ ఎదురైతే జిల్లాలో ఉన్న నామినేటెడ్ పదవులనైనా దక్కించుకోవాలనే ఆతృతతో కాంగ్రెస్ నేతలు కనిపిస్తున్నారు. ప్రధానంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం పోటీపడుతున్నారు. ఇక సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్ పదవికి తీవ్రమైన పోటీ నెలకొన్నది. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలంతా ఈ పదవిపై కన్నేశారు. సిద్దిపేట పట్టణంతోపాటు 22 గ్రామాల పరిధిలో విస్తరించిన సుడా విభాగానికి చైర్మన్‌గా నియామకమైతే ప్రొటోకాల్‌తోపాటు ప్రయోజనాత్మకంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ పదవి దక్కితే రాష్ట్రస్థాయి పదవి దక్కినట్లుగానే యోచిస్తున్నారు. ఇక జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లను నియమించే అవకాశం ఉన్నందున ఈ పదవులకూ పోటీ తీవ్రమైంది. ఇవేకాకుండా దేవాలయాల చైర్మన్లు, ఇతర కమిటీల వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులకు ఇప్పటి నుంచే పోటీపడుతున్నారు.



ఇటీవలే వేసిన క్యూ కాంప్లెక్స్ స్లాబ్‌పై కానరాని వాటర్ క్యూరింగ్

స్లాబ్ వేశారు.. క్యూరింగ్ మరిచారు

- మల్లన్న ఆలయ క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం
- గతంలో చేపట్టిన ముఖమండపానికి లీకేజీ
- ప్రసాద విక్రయశాల భవనానికి పగుళ్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చేర్యాల, జనవరి 12 : కొమురవెల్లి ఆలయానికి మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులు గంటల తరబడి ఎండలో నిలబడకూడదని రాజగోపుర ఆవరణలో రూ.11 కోట్ల వ్యయంతో చేపడుతున్న క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. రెండు రోజుల క్రితం స్లాబ్ వేయగా, వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేపట్టడం లేదు. బేస్‌మెంట్, పిల్లర్ల నిర్మాణంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలున్నాయి. ఇదే కాంట్రాక్టర్ కొన్నాళ్ల క్రితం ముఖమండప విస్తరణ పనులు చేపట్టగా చిన్నపాటి వర్షానికే లీకేజీ అవుతుంది. అంతేకాకుండా ప్రసాద విక్రయ, బుకింగ్ కార్యాలయ భవనం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. సమపాళ్లలో సిమెంట్, ఇసుక మిశ్రమం వినియోగించకపోవడంతో పాటు వాటర్ క్యూరింగ్ చేయకపోవడం వలన కొద్దిరోజులకే పగుళ్లు పట్టాయి. చిన్నపాటి వర్షానికే గోడలు చెమ్మగిల్లి పెచ్చులూడుతున్నాయి. పగుళ్లు కనబడకుండా సవరించేందుకు లప్పంతో పూడ్చివేస్తున్నారు. ఆలయాధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు

కొద్ది రోజుల క్రితం కొమురవెల్లికి విచ్చేసిన కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ భవన నిర్మాణం పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తచేశారు. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిపించాలని ఈవో బాలాజీని ఆదేశించారు. కానీ రెండు వారాలు గడిచినా కాంట్రాక్టర్ కలెక్టర్‌కు అందుబాటులోకి రాలేదు. అయినా ఈ కాంట్రాక్టర్‌తోనే పనులు కొనసాగింపచేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొమురవెల్లి మల్లన్న ఆలయ బుకింగ్ కార్యాలయ భవనానికి పగుళ్లు రావడంతో లప్పంతో పూడ్చే పనులను చేయిస్తున్న ఆలయాధికారులు

‘గృహలక్ష్మి’ బిల్లు చెల్లించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళల ధర్నా

నారాయణరావుపేట, జనవరి 12 : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు ఇవ్వడంతో అప్పు తెచ్చి మరి ఇంటి పనులు ప్రారంభించుకున్నామని, ఈ పథకం రద్దు చేసినా తమకు బిల్లులు చెల్లించాలని ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గృహలక్ష్మి పథక ప్రొసీడింగ్ కాపీలు తీసుకున్నాక ఇప్పటివరకు చేసిన నిర్మాణ పనులకు బిల్లులు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం వస్తుందన్న నమ్మకంతో అప్పు తెచ్చి నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు కూల్చి వేసి గృహ నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మారెడ్డికి మహిళలు వినతిపత్రాన్ని అందజేశారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు మద్దతుగా నిలిచారు.



గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ మిశ్రా



పట్టు రైతులతో మాట్లాడుతున్న జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ మిశ్రా

చిన్నకోడూరు, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఆర్థికాభివృద్ధి సాధించాలని కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ మిశ్రా అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును శుక్రవారం మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మల్బరీ తోటలను, పట్టు పురుగుల షెడ్‌లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పట్టు సాగులో వినియోగించే యంత్రాలను సబ్సిడీపై అందించే విధంగా కృషి చేయాలని రైతులు ఆయనను కోరగా వచ్చే బడ్జెట్‌లో కేటాయించే విధంగా చూస్తామని తెలిపారు. అనంతరం డీహెచ్ఎస్‌వో సునీత మిర్చి తోటలను పరిశీలించి, తోటలకు సోకుతున్న నల్ల తామర తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఇంద్రసేనారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్, ఏఎస్‌వో లింగం, పట్టు రైతులు నర్సింహులు, రంగయ్య, సంతోష్, ప్రవీణ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మా బిల్లులు ఇంకెప్పుడిస్తరు?



నెలాఖరుతో ముగియనున్న గ్రామ పంచాయతీల పదవీకాలం

- అప్పుల్లో కూరుకుపోయిన సర్పంచ్‌లు
- అభివృద్ధి బిల్లుల పెండింగ్‌తో మనోవేదన
- బిల్లులు రాకుంటే గతేంటని ఆందోళన

అక్కన్నపేట, జనవరి 12 : మరికొన్ని రోజుల్లో పంచాయతీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగియనున్నది. గ్రామాభివృద్ధి కోసం అప్పుచేసి మరీ పాటుపడిన సర్పంచ్‌లు సకాలంలో బిల్లులు రాక మనోవేదనకు గురవుతున్నారు. రోజులు దగ్గరపడుతున్న కొద్దీ సర్పంచ్‌ల్లో ఆందోళన రెట్టింపవుతున్నది. లక్షల్లో ఖర్చు చేసి పనులు పూర్తి చేస్తే వడ్డీలు కట్టలేక ఆస్తులను అమ్ముకునే దుస్థితికి చేరుకున్నామని వాపోతున్నారు.


కేంద్ర ఆర్థిక సంఘం నిధులే ఆసరా

జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను జనాభా ప్రతిపాదికన మంజూరు చేస్తారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఏడాదిన్నర నుంచి అతీగతీ లేవు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులే గ్రామ పంచాయతీలకు దిక్కుగా నిలిచాయి. ఈ నిధులు సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయి. గ్రామాల్లో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్, మురుగు కాల్వల శుభ్రం, వీధిలైట్లు, వాటర్ పైపుల లీకేజీలు, రోడ్ల శుభ్రతకు వెచ్చించారు. ఈ నిధులు చాలకపోవడంతో కొంతమంది సర్పంచ్‌లు అప్పు చేసి ఖర్చు పెట్టారు. దీంతో పాటు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సైతం లక్షల్లో అప్పు తెచ్చి పనులు చేశారు. 20 నెలల నుంచి ఈ బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆవేదనలో మగ్గుతున్నారు. పదవీకాలం దగ్గర పడుతున్న కొద్దీ వారిలో ఆందోళన ఎక్కువవుతున్నది. వడ్డీకి తెచ్చి మరీ గ్రామాభివృద్ధి కోసం పాటుపడితే బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

పదవీకాలం ముగిసేలోగా చెల్లించేనా?

గతేడాది బిల్లుల కోసం సర్పంచులు పట్టుబట్టగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ కారణంగా బిల్లులకు బ్రేక్ పడింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో సర్పంచ్‌లకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. మెజార్టీ పంచాయతీల సర్పంచులు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోతున్నారు. ఈలోగా గ్రామ పంచాయతీల ఐదేళ్ల పదవీకాలానికి సమయం దగ్గర పడడంతో అసలుకే ఎసరు వచ్చింది. పదవీకాలం ముగిసే ఈ నెలాఖరులోపు బిల్లులు చెల్లిస్తారా లేదా అనే విషయంపై ప్రభుత్వ పెద్దల నుంచి స్పష్టత లేకుండా పోయింది. అప్పుతెచ్చి గ్రామాభివృద్ధి కోసం ప్రయాసపడిన తమ గతేంటని సర్పంచులు వాపోతున్నారు.


రూ.25 లక్షల బిల్లులు రావాలి



మా గ్రామంలో చాలా అభివృద్ధి పనులు చేశాను. 20 నెలల నుంచి చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. అప్పు తెచ్చి పనులు పూర్తి చేశా. నాకు రూ.25 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఈ నెలతో మా పదవీకాలం ముగిస్తుంది. మాకు రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.


- జిల్లెల అశోక్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, అక్కన్నపేట మండలం

ఇప్పటికే రెండు ఎకరాలు అమ్ముకున్నా



మా గిరిజన తండాను అభివృద్ధి చేయాలని ఆశతో సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచాను. అప్పు తెచ్చి అభివృద్ధి పనులను చేశాను. అప్పు ఎక్కువ కావడంతో రెండు ఎకరాలను అమ్ముకున్నాను. ఇంకా రూ.2.5 లక్షలు బిల్లులు రావలసి ఉంది. బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

- భూక్యా మల్లేష్‌నాయక్, సర్పంచ్, మల్బెరువుతండా







హరీశ్‌రావును కలిసిన నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 12: నర్సాపూర్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నయిమోద్దీన్ శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. చైర్మన్ మురళిధర్‌యాదవ్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా వైస్‌చైర్మన్ నయిమోద్దీన్‌కు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ఇన్‌చార్జి చైర్మన్‌ను సత్కరించి అభినందించారు.

కలెక్టర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జనవరి 12: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిగా బదిలీ అయిన డాక్టర్ ఎ.శరత్ నుమాజీకి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సంగారెడ్డిలో శరత్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

పీర్ల మజీద్ నిర్మాణ పనులు ప్రారంభం



పీర్ల మజీద్ నిర్మాణం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్

సదాశివపేట, జనవరి 12: సదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు శివరాజ్‌పాటిల్ తన సొంత నిధులు రూ.2లక్షలతో కొత్తగా నిర్మించ తలపెట్టిన పీర్ల మజీద్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి, ఎంపీపీ అధ్యక్షురాలు తొంట యాదమ్మ, ఎంపీటీసీ మన్నె భాస్కర్, ఉప సర్పంచ్ జాన్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎల్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఎన్నిక

మెదక్ అర్బన్, జనవరి 12: తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డా. శ్రీపతి సురేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'తైబంది నీటిని అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

వెల్దుర్తి, జనవరి12: మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామ శివారులో ఉన్న దేవతల చెరువు నీటిని యాసంగి సాగుకు ప్రభుత్వ నిబంధనల మేరకు 250 ఎకరాలకు తైబంది నిర్వహించారు. తైబంది నిర్వహించిన పంట పొలాలకు వస్తున్న నీటిని పైభాగంలోని రైతులు అక్రమంగా వారి పొలాలకు మళ్లిస్తున్నారు. దీంతో తైబందీ నిర్వహించిన కింది పొలాలకు సాగు నీరు అందడం లేదని రైతులు శుక్రవారం తహసీల్దార్ తులసీరామ్, ఇరిగేషన్ ఏఈ కవితలకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ కవిత, ఆర్ఐ జయభరత్‌రెడ్డి పంట కాలువలను పరిశీలించారు. అక్రమంగా నీటిని వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



మెదక్ నుంచి ఎంపీగా
పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వండి: ఆర్ఎస్

సంగారెడ్డి టౌన్, జనవరి 12 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుకు ఆయన లేఖలు పంపించారు. కొన్ని దశాబ్దాలుగా సంగారెడ్డిలో నివాసముంటున్న తనకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యానన్నారు. మెదక్ నియోజకవర్గం పరిధిలో తమ సామాజిక వర్గానికి (పద్మశాలి) 1.20 లక్షల ఓట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ పదవిని సైతం త్యాగం చేశానన్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా సేవలందించానని వివరించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నానని తెలిపారు. ఈ నియోజకవర్గం నుంచి కేసిఆర్‌కు ఒకసారి, కొత్త ప్రభాకర్ రెడిక్కి రెండు పర్యాయాల్లో లోక్‌సభ ఎన్నికల ఏజెంట్‌గా పనిచేశానని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా తొమ్మిది నెలలపాటు పనిచేసిన అనుభవం ఉందన్నారు. అలాగే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా రెండున్నర సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించానని మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ కేటీఆర్‌కు పంపిన లేఖలో వివరించారు.

మత్తు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపండి

● టీన్యాబ్ బ్యూరో, ఏడీజీపీ సందీప్‌శాండిల్య


సమీక్షలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు

మెదక్ అర్బన్, జనవరి 12: జిల్లాలో మత్తు, మాదకద్రవ్యాల విక్రయం, సరఫరాలపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీన్యాబ్) ఏడీజీపీ సందీప్‌శాండిల్యా సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన జిల్లా పోలీసు అధికారులతో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, వాటి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి రవాణాకు పాల్పడిన నిందితులపై అవకాశాన్ని బట్టి పీడీయాక్ట్ నమోదు చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినయోగం వల్ల జరిగే పరిణామాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లాలో మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే జిల్లాపోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712657888 సమాచారం అందించాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, జిల్లా సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

హత్నూర, జనవరి 12: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ శివారులో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వన భోజనం అనంతరం మహిళలు, పురుషులు, యువతీ, యువకులు చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రూపులుగా, వ్యక్తిగత క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయా విభాగాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళలు ఉత్సాహంగా ఆటలు ఆడారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ వెంకటేశం, దౌల్తాబాద్ ఎంపీటీసీలు వీరేశం, ఇందిర, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు నర్సింలు, భిక్షపతి, సతీష్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలను సందర్శించిన సెక్రటరీ


ట్రైబల్ వెల్ఫేర్ న్యాయ కళాశాలను
పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ డాక్టర్ శరత్

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 : సంగారెడ్డిలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ న్యాయ కళాశాల(టీటీడబ్ల్యూఆర్ఎల్)ను ఆ శాఖ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్ సందర్శించారు. కళాశాలలో కలియ తిరుగుతూ విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, బోధనపై ఆరా తీశారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు కళాశాల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

ప్రభుత్వం కొత్త జిల్లాలను రద్దు చేస్తుందట

● ఓడినా ప్రజల వెంటే ఉంటాం
● గజ్వేల్‌లోని అభివృద్ధిని చూసి కాంగ్రెస్ వాళ్లు ఓర్చవడం లేదు
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


కరెంట్ కష్టాలను మాజీ మంత్రి
హరీశ్‌రావుకు విన్నవిస్తున్న మహిళలు

మనోహరాబాద్ జనవరి12: ఇప్పుడొచ్చిన ప్రభుత్వం కొత్త మండలాలను జిల్లాలను రద్దు చేస్తుందట, కొత్త విద్యుత్ పాలసీ తెస్తామంటున్నది, కొత్త పాలసీ అంటే పాత కాంగ్రెస్ కరెంట్ తెస్తారా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలసి ఆవిష్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ మొక్కవోని పోరాటం వల్లే వచ్చిందన్నారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది కేసీఆరే అన్నారు. కేసీఆర్ లేకుండా తెలంగాణ లేదు, కేసీఆర్‌ను తెలంగాణను ఎవరూ వేరు చేయలేరు. తెలంగాణ వచ్చింది కాబట్టే మన నీళ్లు మనకు వచ్చాయని, మన గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆసరా పెన్షన్, రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మీ, దివ్యాంగులకు పెన్షన్, కేసీఆర్ కిట్ ఇవన్నీ తెచ్చింది మన కేసీఆర్ అన్నారు. ప్రజాతీర్పును అంగీకరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ప్రతి ఓటుకు కృతజ్ఞతతో పని చేస్తాం అన్నారు. మనోహరాబాద్ మండల ఏర్పాటు చేసింది కేసీఆర్, కానీ ఇప్పుడొచ్చిన ప్రభుత్వం వాటిని రద్దు చేస్తుందట. కేసీఆర్ రైతులకు ఇచ్చిన 24 గంటల కరెంట్‌పై కూడా అబద్ధాలు చెబుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీనీ రద్దు చేశారు. మనం చేసిన అభివృద్ధిని కక్షతో అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ప్రజలంటే రాజకీయం, బీఆర్ఎస్‌కు ప్రజలంటే బాధ్యత, తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. బీఆర్ఎస్ ఓడినంత మాత్రాన ప్రజలను వదిలేయమని, వారి పక్షాన పోరాడతామని, బీఆర్ఎస్‌కు ప్రజలే దేవుళ్లు అన్నారు. బీఆర్ఎస్ మీద ఆరోపణలు చేసే ప్రజలు ఊరుకోరు, ఆరోపణలు మాని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం ప్రజల పక్షాన అసెంబ్లీలో గట్టిగా పోరాడతాం అన్నారు. అనంతరం కొంతమంది మహిళలతో ఆయన మాట్లాడగా... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంట్ సరిగా రావాడంలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ బాలకృష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు పురం మహేష్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎల్లక్షన్‌రెడ్డి, సర్పంచ్ రేఖామల్లేష్, రాజుయాదవ్, సర్పంచుల, ఎంపీటీసీలు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జీడీపల్లి గ్రామంలో
మాట్లడుతున్న హరీశ్‌రావు

ఉపాధిహామీ పథకాన్ని వేగవంతం చేయాలి

● జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు



మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం
గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్డీవో అధికారి శ్రీనివాసరావు

గుమ్మడిదల, జనవరి 12 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని వేగవంతం చేసి కూలీల సంఖ్యను పెంచే విధంగా అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మూడో విడత ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ ప్రజా వేదికలో 2022-23 సంవత్సర కాలంలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులను ప్రజావేదికలో చదివి వినిపించారు. ప్రస్తుతం 32 లక్షల 19 వేల రూపాయలు కూలీల సామగ్రికి ఖర్చు చేశామని ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి హామీ రికార్డులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని తెలిపారు. చెట్లు ఎండిపోయిన చోట మొక్కలను నాటే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. కొత్తగా 50 వరకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వరావు, ఎంపీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొట్టి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న బీజేపీ

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆరోపణ



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో
మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, జనవరి 12 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పొట్టగొట్టి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆరోపించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదించి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్పొరేట్‌లకు అనుకూలంగా చట్టాలు చేసిన బీజేపీ ప్రభుత్వానికి భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఒకవైపు నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసే మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేది నుంచి ఫిబ్రవరి 16వ తేది వరకు నిర్వహించే క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ. సాయిలు, నాయకులు విద్యాసాగర్, వరలక్ష్మీ, నాగేశ్వరరావు, బాబురావు, కొండల్‌రెడ్డి, జయరం, వంశీ, శ్రీధర్‌రావు, సత్తిబాబు, విజయ తదితరులు పాల్గొన్నారు.

90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో
విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు, తహసీల్దార్, ఎస్ఐలు

కల్హేర్, జనవరి 12; మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని శుక్రవారం విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. మండల పరిధిలోని ఖానాపూర్(కె) చౌరస్తాలో టీఎస్ 12 యుబీ, 6646 నంబరు గల డీసీఎం వ్యాను గురువారం రాత్రి రొడ్డుపై ఉన్న బురదలో దిగబడింది. కంగ్టి సీఐ హన్మంతు అటువైపుగా వెళ్తూ ఆ వ్యానును గమనించి అందులో ఏమున్నాయని డ్రైవర్‌ను ప్రశ్నించాడు. అందులో నూకలు ఉన్నాయని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చిన సీఐ వ్యానుపై కప్పిన కవర్‌ను తొలగించి చూడగా, అందులో రేషన్ బియ్యం ఉండడంతో కల్హేర్ ఎస్ఐ వెంకటేశాన్ని పిలిపించి వ్యానును ఆయనకు అప్పగించారు. వెంటనే రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు సమాచారమందించగా, పౌర సరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ టీం అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావ్, తహసిల్దార్ ప్రభాకర్, డిప్యూటీ తహసిల్దార్లు సాయిరవి, రాజు పటేల్ కల్హేర్‌కు చేరుకుని డీసీఎం వ్యానులోని బియ్యాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గోదాంకు తరలించారు. విచారణ అనంతరం పూర్తి స్థాయిలో వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆస్తిలో వాటా అడుగుతున్నదని..
రెండో భార్యను హత్య చేయించిన భర్త


నారాయణఖేడ్‌లో వివరాలు తెలుపుతున్న పోలీసులు

నారాయణఖేడ్, జనవరి 12: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో ఈ నెల 8న అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన మహిళది హత్యేనని, ఈ హత్యలో ఆమె భర్తే కీలక సూత్రధారని పోలీసులు తేల్చారు. ఆస్తిలో వాటా అడగమే కాకుండా ఇల్లు కొనివ్వాలని కోరినందుకు రెండో భార్యను భర్త హత్య చేయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.. పట్టణానికి చెందిన సయ్యద్ యూనుస్‌కు మొదటి భార్య ఉండగా, అంజూమ్‌బేగం(39)ని రెండో వివాహం చేసుకున్నాడు. అంజూమ్‌బేగం ఆరు నెలలుగా సొంతిల్లు కట్టించాలని, లేదా కొనుగోలు చేసి ఇవ్వాలని భర్తను కోరుతూ వస్తున్నది. అంతే కాకుండా ఆస్తిలో వాటా ఇవ్వాలని గొడవ పడుతున్నది. ఆమెను హత్య చేస్తే ఆస్తి మిగలడంతో పాటు తనకు మానసిక ప్రశాంతత ఉంటుందని భావించాడు యూనుస్. ఈ నెల 6న తన అన్న కుమారుడైన అయూబ్‌తో ఈ వివరాలు చెప్పాడు. అంజూమ్‌ను హత్య చేస్తే ఎంత డబ్బయినా ఇస్తానని, దుబాయ్‌కి పంపిస్తానని, పోలీసు కేసు కాకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. దీంతో అంజూమ్‌ను హత్య చేసేందుకు అయూబ్ ఒప్పుకున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు అయూబ్ తన స్నేహితుడైన మైనర్‌తో కలిసి అంజూమ్ అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. మైనర్‌ను ఇంటి బయట ఉంచిన అయూబ్ ఇంట్లోకి వెళ్లి బెడ్రూంలో ఉన్న అంజూమ్‌బేగం కంటిపై, నుదిటిపై గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఆమె కింద పడిపోవడంతో బెడ్రూం నుంచి వంట గదిలోకి లాక్కొని వెళ్లి ప్లాస్టిక్ వైపర్‌తో గట్టిగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. ఆ తర్వాత హత్య చేసిన విషయం యూనుస్‌కు ఫోన్‌లో చెప్పాడు. వారిని కర్ణాటకలోని బీదర్‌కు పారిపొమ్మని యూనుస్ సలహా ఇచ్చాడు. విచారణలో భాగంగా అంజుమ్‌బేగం హత్య కేసులో మొదటి నిందితుడైన అయూబ్, రెండో నిందితుడైన యూనుస్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చడమే కాకుండా రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు మూడు రోజుల్లోనే ఛేదించినట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

విద్యార్థికి రాష్ట్ర స్థాయి అవార్డు

పాపన్నపేట, జనవరి 12: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదవుతున్న చాకలి విగ్నేష్ ఇంటింటా ఇన్నోవేటర్‌లో రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. దివ్యాంగులు, వయోవృద్ధులు, పక్షవాతం వచ్చిన వారు, యాక్సిడెంట్‌లో చేతులు విరిగిన వారికి వేసేందుకు ప్రత్యేకమైన చొక్కాను రూపొందించాడు. పాపన్నపేట మండలం నాగసానిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్ సహకారంతో విగ్నేష్ ఈ చొక్కాను రూపొందించాడు. అవార్డు దక్కించుకున్న విద్యార్థిని నాగసానిపల్లి గ్రామస్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడా రాంకిషన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక


గణేష్ కుమార్

చేగుంట, జనవరి 12: రాష్ట్ర రగ్బీ అసోసియన్ అధ్యక్షుడిగా కరణం గణేష్ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ ఎన్నికల్లో 16 జిల్లాల ప్రతినిధులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు బైలాస్ ప్రకారం 4 సంవత్సరాలు కొనసాగుతుందని, ఈ ఎన్నికలలో రిజిస్టర్ అయిన 25 జిల్లాలకు చెందిన 16 జిల్లాల ప్రతినిధులు ఏకాభిప్రాయం ప్రకారం అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించే దిశగా మరింత కృషి చేస్తానన్నారు. తన గెలుపుకు వెన్నంటి ఉండి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీఆయన ధన్యవాదాలు తెలిపారు.

గాయపడిన కృష్ణ జింక మృతి

రేగోడు జనవరి 12: కుక్కల దాడిలో గాయపడిన కృష్ణ జింక మృతి చెందిన సంఘటన రేగోడు మండలం తాటిపల్లి గ్రామ శివారులో జరిగింది. గురువారం రాత్రి రేగోడు మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో కృష్ణ జింకను కుక్కలు వెంబడించాయి. మిషన్ భగీరథ ట్యాంకుల సమీపంలో వెంచర్‌కు వేసిన ఇనుప జాలికి కృష్ణ జింక తగిలి పడిపోవడంతో కుక్కలు వచ్చి గాయపరిచాయి. అటుగా వెళుతున్న తాటిపల్లి గ్రామస్థులు కుక్కలను తరిమేసి జింకను కాపాడారు. పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే కృష్ణ జింక తీవ్రగాయాలతో మృతి చెందింది. పెద్ద శంకరంపేట ఫారెస్టు అధికారులు మృతిచెందిన కృష్ణ జింకను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద శంకరంపేట మండలం వెంకటాపురం అటవీ ప్రాంతంలో వెటర్నరీ అధికారులతో పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశామని బీట్ ఆఫీసర్ నర్సింలు తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఖేడ్ఆర్డీవో కార్యాలయంలో
వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌డీఎఫ్ నాయకులు

నారాయణఖేడ్, జనవరి 12: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌డీఎఫ్ ఉమ్మడిజిల్లా నాయకులు తెంకటికుమార్ ఖేడ్ ఆర్డీవో కార్యాలయ అధికారులకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్ మెంట్, ఉపకార వేతనాలు వసతి గృహంలో ఉండే విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గురుకులాల కోసం సొంత భవనాలు నిర్మించాలని, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తూ జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడిజిల్లా నాయకులు పవన్, అనిల్, మహిపాల్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో నేరస్థునికి ఏడాది జైలు

హుస్నాబాద్, జనవరి 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని వంశీ అనే నేరస్థుడికి శుక్రవారం సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ పోక్సో కోర్టు జడ్జి ఫోక్సో కేసులో ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 1,100 జరిమానా విధించారు. ఎస్ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబరు 6వ తేదీన హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)ను స్కూల్‌కు వెళ్ళి వచ్చే క్రమంలో బోయిని వంశీ ప్రేమ, పెళ్లి అంటూ వేధింపులకు గురి చేశాడు. బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అప్పటి నుంచి సిద్దిపేట ఫస్ట్ ఏడీజే ఫోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. వంశీపై నేరం రుజువైనందున ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధించినట్లు ఎస్ఐ వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక, జనవరి 12 : రెండుద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. కుకునూరుపల్లి గ్రామానికి చెందిన సూరారం వేణుమాధవ్ మోటార్ సైకిల్‌పై మాత్‌పల్లి నుంచి రాజీవ్ రహదారి మీదుగా కుకునూరుపల్లికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ లకుడారం శివారులో ఢీకొట్టింది. దీంతో వేణుమాధవ్ కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్, జనవరి 12: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖేడ్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు మాట్లాడుతూ ముగ్గులపోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అధికారుల చేతుల మీదుగా అందజేసామని సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొటారి నర్సింలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నాయకులురమేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నియోప్రగతి ఉన్నత పాఠశాలలోనూ బాలికలకు ముగ్గుల పోటీలతో పాటు బాలురకు పతంగుల పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కుమ్మరి ప్రకాష్, కరస్పాండెంట్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని నియోప్రగతి పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గులపోటీలను నిర్వహించారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీ

జోగిపేట, జనవరి12: ఓటరు అవగానా కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం జోగిపేటలో ప్రభుత్వ అధికారులు మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీకి విశేషమైన ఆదరణ లభించింది. మహిళలు పోటీలు పడి ముగ్గులు వేశారు. ఈసందర్భంగా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు కలిసి ఆర్డీవో ఆర్. పాండు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాగా, ముగ్గుల పోటీ విజేతలను జనవరి 26న ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దారు ఆంటోనీ, ఇంచార్జి ఎంపీడీవో సౌజన్యారావు, మెప్మా గీఎంసీ భిక్షపతి గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

14న మర్పల్లిలో ముగ్గుల పోటీలు

రేగోడు జనవరి 12: ఈనెల 14వ తేదీన మర్పల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్యారారం గ్రామానికి చెందిన తెలుగు నర్సింలు తెలిపారు. మర్పల్లి శ్రీవిఠలేశ్వర ఆలయం సమీపంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో మహిళలు భారీగా పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతులు అందిస్తామని అన్నారు.

సంక్రాంతి ప్రకృతి పండగ :అనుపమారెడ్డి

నారాయణఖేడ్,జనవరి 12: సంక్రాంతిపర్వదినం ప్రకృతి పండగ అని, మనిషికి, మట్టికి, మనిషికి ప్రకృతికి ప్రధానంగా సూర్యుడికి, మానవుడికి మధ్యన ఉన్న బంధాన్ని తెలియజెప్పడం కోసమే సంక్రాంతి పండగ జరుపుకుంటామని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ్మరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేసి, అనంతరం మాట్లాడారు. ప్రతీ జీవికి ప్రత్యక్షదైవమైన సూర్యుడి మకర ప్రవేశం సందర్భంగా సంక్రాంతిపర్వదినాన్ని అన్ని వర్గాల వారు జరుపుకుంటారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి అనుపమ్మ రెడ్డి వ్యక్తిగతంగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో విజేతలకి బహుమతులు అందజేస్తున్న అనుపమారెడ్డి


జోగిపేటలో ముగ్గులు వేస్తున్నయువతులు


గజ్వేల్‌లో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏసీపీ మడత రమేశ్ తదితరులు


చేర్యాలలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎస్ఐ దామోదర్, నాయకులు


హుస్నాబాద్ పట్టణంలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


హుస్నాబాద్ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

యువత వివేకానందుడి మార్గంలో నడవాలి

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థలు, యువజన సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు పిలుపునిచ్చారు.

గజ్వేల్, జనవరి 12: యువత స్వామి వివేకానందుడి మార్గంలో నడవాలని గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ చౌరస్తాలోని వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానందుడు అని కొనియాడారు. ఆయన జయంతి రోజునే జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం మనకెంతో గర్వకారణమన్నారు. యువత చిన్న విషయాలకే మనస్తాపం చెందకుండా వివేకానందుని మాటల్లోని ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రాంతంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న అధ్యాపకురాలు భవాని, ఎక్సైజ్ ఎస్ఐ మహ్మద్ సలీం, చిత్రకారులు వంశీకృష్ణ, టీవీ సింగర్ అమరవాది శ్రీవాత్సవ్, కవి గోవర్ధన్, యువ నాయకులు కుమ్మరి సంతోష్, రాళ్లబండి ప్రవీణ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సంతోష్, నర్సింహాచారి, ప్రకాశ్, సురేశ్, నాగరాజు, ప్రశాంత్, నర్సింలు, శేఖర్, ప్రవీణ్ తదితరులున్నారు. అదేవిధంగా గజ్వేల్ మండలంలోని జాలిగామ గ్రామంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువ చైతన్య యూత్ అధ్యక్షుడు కుమ్మరి సంతోష్, సర్పంచ్ మాచాపురం శివయ్య, ఎంపీటీసీ రాజిరెడ్డి, యువజనసంఘ సభ్యులు పాల్గొన్నారు.


చిన్నకోడూరులో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


మద్దూరు: లద్నూరులో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ సుదర్శన్

● **చేర్యాల:** వివేకానంద జయంతిని పురస్కరించుకుని చేర్యాల ఎస్ఐ దామోదర్ శుక్రవారం పట్టణంలోని వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మర్మాముల రామచంద్రమూర్తి, కాపర్తి రాజేశం, జిన్నారం రమేశ్, ఉప్పల నాగరాజు, రాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత జాతీయ యువ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగా శిక్షకుడు బీరుకూరి మనోహర్ విద్యార్థులచే యోగాసనాలు వేయించి పండ్లు పంపిణీ చేశారు. వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

● **రాయపోల్:** దౌల్తాబాద్ మండలకేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ మెదక్ విభాగ్ కార్యదర్శి సుభాష్ జాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఆసుపత్రి సూపరిండెండెంట్ రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

చిన్నకోడూరు: మండలకేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాతంగి నాగరాజు ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండలంలోని లద్నూరు గ్రామంలో సర్పంచ్ జీడికంటి సుదర్శన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమారస్వామి, బాలు, రామడుగు బాల్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

నేను స్థలాన్ని కబ్జా చేయలేదు



మాట్లాడుతున్న కౌన్సిలర్ బ్రహ్మం

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 12: సిద్దిపేట పట్టణంలో కొంత స్థలాన్ని కబ్జా చేశానని తనపై వస్తున్న ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని కౌన్సిలర్ బ్రహ్మం పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని 1640 సర్వే నంబర్‌లో మొత్తం రక్బా 2.11 ఎకరాలు ఉండగా, అందులో 1.05 ఎకరాలు మాత్రమే పట్టేదారు నదిమొద్దిన్ దగ్గర నుంచి తాను కొనుగోలు చేశానని తెలిపారు. వీటికి సంబంధిత ఆధారాలను ఆయన మీడియా ముఖంగా చూపారు. ఈ స్థలానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే ఆ స్థలంపై తప్పుడు పత్రాలు సృష్టించిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ స్థలాన్ని ప్లాట్లుగా చేసి అమాయకులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై న్యాయస్థానంలో ఇంజక్షన్ ఆర్డర్ కూడా తీసుకున్నామని ఆయన తెలిపారు. న్యాయస్థానంలో నన్ను ఎదుర్కోలేక అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి, విచారణ జరిపి తమకు, ప్లాట్లు కొన్న వారికి న్యాయం చేయాలన్నారు

దూళిమిట్టలో సీసీ రోడ్డు పనులు

మద్దూరు, జనవరి 12 : దూళిమిట్ట మండల కేంద్రంలో ఉపాధిహామీ, సీడీఎఫ్ కింద మంజూరైన సీసీ రోడ్డు పనుల్ని సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

కొండపాక, జనవరి 12: ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవలసిన మెలకువలపై రైతులకు అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు కొండపాక ఐవోసీ భవనంలో జరిగిన సమావేశంలో అధికారులు సాగుపై తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పండరి, నెట్‌ఫిన్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేష్, ఏవో ప్రియదర్శిని, వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, రమ్య పాల్గొన్నారు. అనంతరం పీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ ఫీల్డ్‌ను సందర్శించి డ్రిప్ ఫిల్టర్ ట్యాంక్ మెయింటెనెన్స్ గురించి తెలిపారు.

వేచరేణిలో వైన్స్ ఏర్పాటు చేయొద్దు

చేర్యాల, జనవరి 12: చేర్యాల మండలం వేచరేణి శివారులోని గుర్జకుంట క్రాస్‌రోడ్డు వద్ద వైన్‌షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని గీత పారిశ్రామిక సహకారసంఘం ప్రతినిధులు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ గుర్జకుంట క్రాస్‌రోడ్డు సమీపంలోని తాటి, ఈత వనాలలో కల్లు విక్రయించుకుంటూ గీత కార్మికులు జీవిస్తున్నారని, చేర్యాల పట్టణానికి చెందిన వైన్‌షాప్‌ను ఇక్కడ నిర్వహించేందుకు అనుమతి ఇస్తే జీవనోపాధి కోల్పోతామని వాపోయారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుని అనుమతి ఇవ్వరాదని కోరారు. ఆయన వెంట బూర్గు బాలాజీ, నారాయణ, బూర్గు రవీందర్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే


సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి

కొండపాక, జనవరి 12: చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాశ్‌రావు అన్నారు. కొండపాక వేద ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం 67వ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా తీసుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఎస్జీఎఫ్ అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు కోచ్‌లు పాల్గొంటున్నట్టు తెలిపారు. పోటీల నిర్వహణ కోసం ప్రత్యేకంగా వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని, 14వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కొండపాక కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి, పరిశీలకులు బిక్కు నాయక్, నీరజ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట సతీష్ , వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.

దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ..

మద్దూరు, జనవరి 12 : దూళిమిట్ట మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14, 15వ తేదీల్లో దూళిమిట్ట స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోపికృష్ణ, అనిల్, సతీష్, లింగం తెలిపారు. దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలతో పాటు ఇతర కొన్ని ఆహ్వానిత జట్లకు మాత్రమే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు జనవరి 13 సాయంత్రం 4 గంటలలోపు జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ రుసుం రూ.1000/- లు ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ జట్లకు షీల్డుతో పాటు నగదును బహుమతిగా అందజేస్తామన్నారు.

అహ్మదీపూర్‌లో మండలస్థాయి క్రికెట్ పోటీలు

గజ్వేల్, జనవరి 12: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఆయనతో నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజాం తదితరులున్నారు.

14న గోదారంగనాయకుల కల్యాణం

కోహెడ, జనవరి 12: గోదా కల్యాణ మహోత్సవం ఈ నెల 14వ తేదీన ఉదయం 11 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ డాక్టర్ కోహెడ ప్రసాద్‌రావు శర్మ శుక్రవారం తెలిపారు. కోహెడ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నెల రోజులుగా నిత్యం తిరుప్పావై పాశుర పఠనం, ప్రత్యేక పూజాధికార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా భోగి పండుగ పర్వదినాన గోదా రంగనాయకుల కల్యాణము నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన వారి కోరికలు తీరడంతో పాటు పెళ్లి కాని వధూవరులకు చక్కటి జీవితభాగస్వాములు లభిస్తారని వివరించారు.


గోదా రంగనాయకస్వామి వారు

కుకునూరుపల్లి రామాలయంలో..

కొండపాక, జనవరి 12 : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా కుకునూర్‌పల్లి రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గోదాదేవికి 108 గంగాళంలో క్షీరాన్న నైవేద్యాన్ని నివేదించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొని పూజలు చేశారు.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు


సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 12: కాంగ్రెస్ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్తున్నదని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, కాంగ్రెస్‌పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, జి శ్రీనివాస్, మార్క సతీష్‌గౌడ్, దాసరి రాజు, గయాజుద్దీన్, రషీద్, దాస అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, సది, నాయకులు ఎండీ హసన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, బిక్యానాయక్, అయిలయ్య, కోడం ప్రభాకర్, వెన్న రాజు, కిష్టస్వామి, అయిలేష్ యాదవ్, అలువోజు రవీందర్, దండి కొమురయ్య తదితరులున్నారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు


సిద్దిపేట అర్బన్: ఇందూర్ కళాశాలలో సంక్రాంతి సంబురాలు




సిద్దిపేట క్రైం: అంబిటస్ స్కూల్‌లో వేసిన ముగ్గులు

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట క్రైం, జనవరి 12: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, భోగి మంటలను వేశారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పతంగులను ఎగరవేశారు. స్టాఫ్ అండ్ స్టూడెంట్స్ ర్యాంప్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజుతో పాటు వివిధ విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు, సిబ్బంది పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించి ముగ్గుల పోటీలతో పాటు పిండివంటలను చేసి పెట్టారు. సిద్దిపేటలోని స్థానిక అంబిటస్ హైస్కూల్లో విద్యార్థుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీకి విశేష స్పందన వచ్చింది. ప్రముఖ చిత్రకారుడు రుస్తుం, ఉపన్యాసకురాలు డాక్టర్ సువర్ణదేవి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. పాఠశాల ఆవరణలో భోగిమంటలు, హరిదాసు కీర్తనలను పాఠశాల విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎడ్ల జ్యోతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో

గజ్వేల్, జనవరి 12: మండలంలోని రిమ్మనగూడ శివార్లలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో రంగుల ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. భోగిమంటల చుట్టూ ఉల్లాసంగా తిరిగి, కైట్ ఫెస్టివెల్‌లో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ ప్రత్యేక వంటకాలైన పిండి వంటకాలను సిద్ధం చేసి, స్టాల్స్‌గా ఏర్పాటు చేశారు. ముగ్గులు, కైట్ ఫెస్టివల్, సంప్రదాయ పద్ధతిలో సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది తదితరులున్నారు.

జగదేవ్‌పూర్‌లో ముగ్గుల పోటీలు

జగదేవ్‌పూర్, జనవరి 12: రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో శుక్రవారం జగదేవ్‌పూర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాబుగౌడ్ మాట్లాడుతూ మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు చంటి, జగదీశ్వర్, వాణి పాల్గొన్నారు.

సిరిసినగండ్ల విద్యార్థినికి సాహిత్య పురస్కారం


ఐశ్వర్య

కొండపాక, జనవరి 12: మండలంలోని సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని పుల్ల ఐశ్వర్యకు సాహిత్య పురస్కారం లభించింది. హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం ప్రకటించిన బాలసాహిత్య పురస్కారానికి విద్యార్థిని ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్ శుక్రవారం తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ కథలు రాసిన 20 మంది బాలలను ఎంపిక చేశారని తెలిపారు. ఐశ్వర్య రాసిన తేనెటీగ సామం అనే కథకు పురస్కారం లభించిందన్నారు. వచ్చే నెల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయం బృందం విద్యార్థినిని అభినందించింది.

మోడల్ స్కూల్‌లో అంకురం బిజినెస్ స్టాల్ ప్రారంభం


స్కూల్‌లో లేడీస్ ఎంపోరియాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్

హుస్నాబాద్ టౌన్, జనవరి 12: ప్రభుత్వం చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలను, వినూత్న వ్యాపార ఆలోచనలను పెంపొందించడానికి చేపట్టిన అంకురం బిజినెస్ స్టాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా పాఠశాలలో స్టైలిస్ లేడీస్ ఎంపోరియం, జనరల్ స్టోర్‌ను ప్రిన్సిపాల్ వి అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ స్టాల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ నళినిదేవి సందర్శించారు.

దిలాల్‌పూర్ లక్ష్మీనృసింహుడికి మెదక్ ఎమ్మెల్యే పూజలు


స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

గజ్వేల్, జనవరి 12: మండల పరిధిలోని దిలాల్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహ ఆలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అభిమాని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా రోహిత్‌రావు గెలుపు కోసం దిలాల్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మొక్కుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు దిలాల్‌పూర్ గ్రామంలోని ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనవెంట నాయకులు జంగం రమేశ్‌గౌడ్, యేర్ర రాజశేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులున్నారు.

దళితబంధు పథకాన్ని కొనసాగించాలి

చేర్యాల, జనవరి 12: డప్పు కొట్టే, చెప్పులు కుట్టేవృత్తిదారులకు నెలకు రూ.5వేల పింఛన్ అందించడంతో పాటు దళితబంధు పథకాన్ని కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ పేర్కొన్నారు. చేర్యాలలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 29న హైదరాబాదు ఇందిరా పార్కువద్ద పోరుగర్జన చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ చంటి ద్వారా పోరుగర్జన కరపత్రం, పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సిద్దిపేటలో కైట్ ఫెస్టివల్‌కు అతిథ్యమివ్వనున్న కోమటిచెరువు, నెక్లెస్ రోడ్


కోమటిచెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 12: హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన కైట్ ఫెస్టివల్ సిద్దిపేటవాసులను అలరించనున్నది. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేటలో శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నట్లు సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు, నెక్లెస్ రోడ్డు ప్రాంతాలను మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డిలు మాట్లాడుతూ సంక్రాంతి పండగకు కోమటి చెరువు, నెక్లెస్ రోడ్డు వేదికగా మారనున్నాయని చెప్పారు. శనివారం ఉదయం 10 గంటలకు కైట్ ఫెస్టివల్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభిస్తారన్నారు. అందుకు గానూ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయి, వజీర్, యువజన విభాగం అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రజనికాంత్ రెడ్డి, సమన్వయ కర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి


కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రకమిటీ నిర్ణయంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లోగా గొర్రెల పంపిణీ చేస్తామని లేదా నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ నెల రోజులైనా పశు సంవర్ధక శాఖకు కనీసం మంత్రిని కూడా కేటాయించలేదన్నారు. జనవరి 6వ తేదీ లోపు నగదు బదిలీ చేయాలని లేదా పాత పద్ధతిలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిళ్ల ఐలయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, జిల్లా కార్యదర్శులు, సిద్దిపేట పట్టణ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పూర్తి

మద్దూరు, జనవరి 12: ఉమ్మడి మండలంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల అన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో మాట్లాడారు. దూళిమిట్ట తహసీల్దారుకు 11 జీపీలు, మద్దూరు తహసీల్దారుకు 6 జీపీలు, ఎంపీడీవోకు 6 జీపీలకు మండల స్థాయిలో పర్యవేక్షణ బృందాలకు టీం లీడర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో పరిధిలోని టీంలో వచ్చిన 2886 దరఖాస్తులతో పాటు 772 ప్రత్యేక దరఖాస్తులు వచ్చాయన్నారు. మద్దూరు తహసీల్దార్ పరిధిలోని టీంలో వచ్చిన 4,747 దరఖాస్తులతో పాటు 1,587 ప్రత్యేక దరఖాస్తులు వచ్చాయన్నారు. దూళిమిట్ట తహసీల్దార్ టీంలో వచ్చిన 5,157 దరఖాస్తులతో పాటు 1,602 వివిధ అంశాలకు సంబంధించి ప్రత్యేక దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ జాబితాను డీపీవో కార్యాలయంలో సమర్పించినట్లు తెలిపారు.

అనాథ బాలల జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తదితరులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 12: పట్టణంలో శుక్రవారం బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ బాలల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలలతో జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరై మాట్లాడారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్ ప్లాంట్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బాలవికాస వుమెన్ గ్రూపు ప్రోగ్రాం మేనేజర్ లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, వెన్న రాజు, జ్యోతి, సరళ, అమూల్య, అన్నమేరి ఉన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 12: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ శుక్రవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో రమేశ్‌తో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంపాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారు దుర్గా రమణ, అసోసియేట్ అధ్యక్షుడు రామ్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ మహ్మద్ గౌసొద్దిన్, అధికార ప్రతినిధి జయరామరాజు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య సేవలో అమర్నాథ్ అన్నదాన సేవాసమితి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 12: అయోధ్య రామ మందిరం నిర్మాణంలో భక్తులకు అమర్నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదం అందించే అవకాశం లభించినట్టు సేవా సమితి అధ్యక్షుడు ఉప్పల భూపతి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశం మొత్తంలో 5 లంగర్లకు అవకాశం రాగా, సౌత్ ఇండియా నుంచి అమర్నాథ్ అన్నదాన సేవాసమితికి అవకాశం రావడం గొప్ప విషయమన్నారు. అయోధ్యలో ఏర్పాటు చేసే అన్న ప్రసాద లంగర్‌కు కావలసిన సరుకులతో సిద్దిపేట నుంచి శనివారం సాయంత్రం లారీ బయలుదేరుతుందన్నారు. ప్రతి రోజూ సుమారు 10 వేల మంది భక్తులకు దాదాపు 50 నుండి 60 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సరకుల లారీని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్థానిక వేంకటేశ్వరాలయం వద్ద జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో కార్యదర్శి నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్, తిప్పరాజు మధు, నల్ల నాగరాజు, నీలం యాదగిరి, పంపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ జోసెఫ్' సిల్వర్ జూబ్లీ వేడుకలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

హుస్నాబాద్, జనవరి 12: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకంతో పాటు విద్యార్థుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వరంగల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బిషప్ ఉడుముల బాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కొంకటి నళినిదేవి, పాఠశాల ఫాదర్ విజయ్‌కుమార్‌తో పాటు తదితరులున్నారు. కాగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా స్కూలు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.